ప్రజాశక్తి
గురువారం 24 నవంబర్ 2022 5 అనంతపురం



## 'పది' పరీక్ష ఫీజు చెల్లింపునకు 10 వరకు అవకాశం

**అనంతపురం కలెక్టరేట్ :** పదోతరగతి 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించే తేదీని ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు అనంతపురం జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.వెంకట క్రిష్ణారెడ్డి బుధవారం ఆ వివరాలను వెల్లడించారు. పది పరీక్షలకు ఈ నెల 25వ తేదీ నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ప్రధానోపాధ్యాయులు ద్వారా విద్యార్థులు ఫీజులు చెల్లించాలన్నారు. ఎన్ఆర్, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. అపరాధ రుసుం రూ.50తో డిసెంబర్ 11 నుంచి డిసెంబర్ 20వ తేదీ వరకు, రూ.200 రుసుంతో డిసెంబర్ 21 నుంచి 25వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబర్ 26 నుంచి డిసెంబర్ 30వ తేది వరకు చెల్లించవచ్చున్నారు. ప్రధానోపాధ్యాయులు ఎంఎన్ఆర్, ఇతర వివరాలను డిసెంబర్ 20 నుంచి డిసెంబర్ 31వ తేదీలోగా జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి అందజేయాలన్నారు. పరీక్ష ఫీజు పదోతరగతి రెగ్యులర్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు రూ.125, 3 కంటే ఎక్కువ సబ్జెక్టులు పైన రూ.125, 3 అంతకన్నా తక్కువ సబ్జెక్టులకు రూ.110, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతో పాటు అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంటుందని డిఇఒ తెలిపారు.

# రాప్తాడులో రాజకీయ రగడ



ఉపాధి కల్పించే పరిశ్రమ వస్తే... మీరు తరిమేసారంటే.. మీరు తరిమేసారంటూ అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి చేస్తున్న ప్రత్యారోపణలతో రాప్తాడు నియోజకవర్గంలో రాజకీయ రగడ రాజుకుంది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి బెదిరింపులతో పేజ్ ఇండస్ట్రీస్ (జాకీ) పరిశ్రమ తరలి వెళ్లిందంటూ ఇటీవల మాజీ మంత్రి పరిటాల సునీత ఆరోపణలు చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కూడా పరిశ్రమ స్థలంలోకెళ్లి మంగళవారం నాడు నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో అధికార ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి బుధవారం నాడు మీడియా టూర్ ఏర్పాటు చేసి పరిశ్రమ స్థలంతోపాటు, ఆలమూరులో ఏర్పాటు చేస్తున్న సహకార డైయిరీ చూపించారు. ఈ సమయంలో పరిటాల సునీతపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. పరిశ్రమ తరలి వెళ్లేందుకు ఆమె కారణం అంటూ మండిపడ్డారు. ఇలా రాప్తాడులో గత వారంలో రోజులు విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయం వేడెక్కింది.

- కంపెనీ తరలివెళ్లడంపై రచ్చ
- మీరంటే...మీరని ప్రత్యారోపణలు
- ఇద్దరిలోనూ అభివృద్ధిపై కానరాని చిత్తశుద్ధి
- నియోజకవర్గంలో అనేకేళ్లుగా ఎక్కడి సమస్యలు అక్కడే..

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ప్రస్తుతం రాప్తాడు రాజకీయాలు మొత్తం జాకీ పరిశ్రమ చుట్టూ తిరుగుతున్నాయి. టిడిపి హయాంలోనే మాజీ మంత్రి పరిటాల సునీత బంధువుల బెదిరింపులకు 2018లోనే ఆ పరిశ్రమ పోయిందని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చెబుతున్నారు. ప్రకాష్‌రెడ్డి బెదిరింపుల వల్లనే పరిశ్రమ పోయిందంటూ పరిటాల సునీత చెబుతున్నారు. ఇలా గడిచిన నాలుగైదు రోజులుగా నియోజకవర్గంలో పేజ్ ఇండస్ట్రీస్ చుట్టూ రాజకీయ రగడ సాగుతుండటం, అది కూడా పరిశ్రమ తరలివెళ్లటానికి మీరు కారణమంటే.. మీరు కారణమన్న ప్రత్యారోపణలు సాగుతుండటం నియోజకవర్గంతో పాటు జిల్లావాసులు విస్తుపోయి చూసే పరిస్థితి ఏర్పడిండి. ఎక్కడైనా అభివృద్ధి మా హయాంలో జరిగిందంటే, మా హయాంలో జరిగిదంటూ వారి కాలంలో జరిగిన అభివృద్ధి గురించి చెప్పుకోవడం పరిపాటి. కాని రాప్తాడులో మాత్రం పరిశ్రమ తరలివెళ్లడానికి కారణంపై చర్చ సాగుతుండటం గమనార్హం. రాప్తాడు నియోజకవర్గంలో అనేక సమస్యలు తిష్టవేశాయి. వీటికి పరిష్కారాలు దశాబ్ధాలుగా లభించడం లేదు. తాగునీటికి సైతం ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ రాజకీయ రగడ జరుగుతున్న సమయంలో మంగళవారం నాడు ఆత్మకూరు మండల కేంద్రంలో కొంత మంది తాగునీటి కోసం రాస్తారోకో చేశారు. అనంతపురం రూరల్ పరిధిలోనూ తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఈ సమస్యకు గడిచిన దశబ్ధకాలంగా పరిష్కారం లభించలేదు. వీటితోపాటు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

**పేరూరుకు నీరున్నా దిగువకు నీరు వెళ్లదు..!**

రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని రామగిరి మండలంలో పేరూరు డ్యామ్ నిర్మాణాన్ని 1950లో పూర్తిచేశారు. ఈ డ్యామ్ పూర్తయినా దిగువ చెరువులకు నీరందించే కాలువలు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. నీరు వెళ్లే పరిస్థితి లేదు. ఈ డ్యామ్‌కు నీరివ్వడంపై దశబ్ధకాలంగా ప్రకటనలు వెలువడుతూనే ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో డ్యామ్‌కు రంగులేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచ్చేసి అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఆ తరువాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డ్యామ్‌కు హంద్రీనీవా నీరిస్తామని ప్రకటించారు. అయితే అదృష్టవశాత్తు ఈ ఏడాది మంచి వర్షాలకు డ్యామ్ నిండి పొంగింది. అయితే ఇప్పటికీ పిల్ల కాలువలు పూర్తవకపోవడంతో నీరు దిగువకు ఇవ్వలేని పరిస్థితి ఉంది.

**హంద్రీనీవా ద్వారా ఎత్తిపోతలే....**

హంద్రీనీవా ద్వారా ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని పేరూరు డ్యామ్‌కు ఇచ్చేందుకు గత ప్రభుత్వ హయాంలో టెండర్లు పిలిచారు. వీటికి సంబంధించి పనులూ ప్రారంభమయ్యాయి. వైసిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ పేరుతో వాటిని ఆపింది. ఆ తరవాత మూడు రిజర్వాయర్లు అదనంగా చేర్చి నిర్మిస్తామని రెండేళ్ల క్రితం అప్పటి ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అయితే ఆ పనులు ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. భూసేకరణ కూడా పూర్తవకుండానే ఆగిపోయి ఉన్నాయి.

**బంగారు గనులు అంతేనా .?**

ఎక్కడా లేనటువంటి బంగారు సంపద రాప్తాడు నియోజకవర్గం పరిధిలో ఉంది. మూతపడిన ఈ గనులను తెరిపిస్తామని టిడిపి అధికారంలో ఉండగా అప్పటి మంత్రి పరిటాల సునీత, భూగర్భ గనుల శాఖమంత్రి పీతల సుజాతను రామగిరి పిలిపించి చూపించారు. దీనిని తెరిపించి ఈ ప్రాంతంలో ఉపాధి కల్పిస్తామని హామీనిచ్చారు. అయితే ఐదేళ్లలో అది జరగలేదు. వైసిపి అధికారంలోకి వచ్చాకా ఇటువంటి ప్రకటనలే రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేశారు. విదేశాల నుంచి ప్రతినిధులు వచ్చారంటూ హడావుడి చేశారు. కేంద్రం దేశ వ్యాప్తంగా కొత్త గనుల తవ్వకాలకు పిలిచిన టెండర్లను చూపించారు. అయితే ఇప్పటికి అవి ఏమయ్యాయో తెలీయదు. గనుల మాత్రం మూతపడినవి మూతపడినట్టుగానే ఉన్నాయి. ఇలా రాప్తాడులో ప్రధానమైన సమస్యలన్నీ ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దశాబ్ధాలుగా ఉంటున్నాయి. వాటి పరిష్కారానికి నేతలు దృష్టి సారించకుండా పరిశ్రమలను తరిమివేయడంపై పోటీ పడి విమర్శలు చేసుకుంటూ ఉండడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది.



సత్యసాయిబాబా చిత్రపటంతో పుట్టపర్తిలో కొనసాగుతున్న రథోత్సవం

# సంబరంగా సత్యసాయి జయంతి వేడుక

- భక్తులు, పర్యాటకులతో పుట్టపర్తిలో సందడి
- ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరు
- వార్షిక బడ్జెట్ విడుదల



జయంతి ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న కిషన్‌రెడ్డి

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

సత్యసాయి బాబా 97వ జయంతి వేడుకలు పుట్టపర్తిలో సంబరంగా జరిగాయి. దేశ, విదేశాలకు చెందిన భక్తులు, పర్యాటకులు వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో పుట్టపర్తికి విచ్చేశారు. భక్తులతో సాయి కుల్వంత్‌హాల్ కిటకిటలాడింది. ముఖ్య అతిథిగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హాజరయ్యారు. సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు సభ్యులు వార్షిక నివేదికను విడుదల చేశారు. సత్యసాయి విద్యార్థులు, భక్తులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. పట్టణ పురవీధుల్లో సత్యసాయి సూర్య రథోత్సవం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జయంత్యుత్సవాల సందర్భంగా పలువురు ప్రముఖులు బాబా సమాధిని దర్శించుకున్నారు.

**బాబా సేవలు వెలకట్టలేనివి : కిషన్‌రెడ్డి**

మానవాళికి సత్యసాయిబాబా అందించిన సేవలు వెలకట్టలేనివని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాడు పుట్టపర్తిలో నిర్వహించిన బాబా 97వ జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా సాయికుల్వంత్ హాల్‌లో సత్యసాయి మహా సమాధిని భార్యతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం జరిగిన జయంతి వేడుకల కార్యక్రమంలో కిషన్‌రెడ్డి ప్రసంగించారు. ప్రభుత్వాలు చేయలేని పనులను సైతం సత్యసాయి సాయి బాబా ప్రజల కోసం చేశారన్నారు. విద్య, వైద్యం, తాగునీరు అందించిన మహనీయుడన్నారు. పుట్టపర్తిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జనరల్ ఆసుపత్రి ద్వారా రోగాలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయంటే అది సత్యసాయి బాబా గొప్పతనం అన్నారు. విలువలతో కూడిన విద్యాను అందించడంలో సత్యసాయి విద్యా సంస్థలు ముందున్నాయన్నారు. గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్న జనం దాహార్తిని తీర్చిన గొప్ప వ్యక్తి బాబా అన్నారు. బాబా చెప్పిన విధంగా 'అందరినీ సేవించు, అందరినీ ప్రేమించు' అనే సూక్తిని ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు.

**ట్రస్టు వార్షిక నివేదిక విడుదల**

బాబా జయంత్యుత్సవాల సందర్భంగా సత్యసాయి ట్రస్టు వార్షిక నివేదికను కిషన్‌రెడ్డి విడుదల చేశారు. వార్షిక ఆదాయం రూ.200 కోట్లు కాగా వ్యయం 120 కోట్లని నివేదికలో పేర్కొన్నారు. ట్రస్టు కార్యక్రమాలు పారదర్శకంగా ఉంటాయని ప్రతి ఏటా వార్షిక నివేదికను ప్రవేశపెడుతున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ట్రస్టు సభ్యులు ఆర్‌జె.రత్నాకర్, చక్రవర్తి, డాక్టర్ మోహన్, నాగానంద, మాజీ మంత్రులు గీతారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

**భక్తులు, పర్యాటకుల సందడి**

**పుట్టపర్తి రూరల్ :** సత్యసాయిబాబా 97వ జయంతి సందర్భంగా పుట్టపర్తి బాబా భక్తులు, పర్యాటకులతో సందడి నెలకొంది. దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు బుధవారం వేకువజాము నుంచే బాబా సమాధిని దర్శించుకున్నారు. జయంతి సందర్భంగా పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో భక్తులకు అన్నదానాలు, ప్రసాదాలను పంపిణీ చేశారు. బాబా చిత్రపటాలు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ వద్ద, సత్యసాయి భక్తులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది సత్యసాయి భక్తులు, ప్రయాణికులు పాల్గొన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద కార్లు, ఆటో డ్రైవర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎయిర్‌పోర్టు రోడ్డు సమీపం, గణేష్ కూడలితో పాటు పట్టణంలో పలు ప్రాంతాల్లో బాబా చిత్రపటాల ఊరేగింపు కొనసాగింది. విద్యాగిరి వద్ద ఫుట్‌పాత్ పై ఏర్పాటు చేసిన వివిధ దుకాణాల వద్ద జనం సందడి కన్పించింది. పట్టణంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పోలీసు, ఆర్టీసీ, మునిసిపల్, పుడా అధికారులు అన్ని ఏర్పాట్లనూ చేశారు.

## దర్గాహొన్నూరులో మరో విషాదం

### విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి



మృతి చెందిన బోయ వాణి

బొమ్మనహాల్ మండలం దర్గాహొన్నూరు గ్రామంలో వరుస విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నెల 2వ తేదీన విద్యుత్ తీగ తెగి ట్రాక్టర్‌పై పడడంతో ఐదుగురు కూలీలు అక్కడికక్కడే మరణించారు. ఇదిలా ఉండగా మంగళవారం నాడు ఓ రైతు పొలం వద్ద 11 కెవి విద్యుత్ తీగ తెగిపడింది. సమీపంలోని రైతులు గుర్తించి విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరాను నిలిపేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. దీనిని మరవక ముందే ఇదే గ్రామంలో ఓ మహిళా రైతు బోయ వాని(25) బుధవారం ఉదయం విద్యుత్‌షాక్‌తో మరణించింది. పొలం వద్ద విద్యుత్ మోటార్‌ను వేసేందుకు ప్రయత్నించగా అప్పటికే స్టార్టర్ పెట్టెపై సర్వీసు వైరు తెగి పడడంతో షాక్‌కు గురై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. వరుస 'విద్యుత్ షాక్'లతో దర్గాహొన్నూరు గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

## పంట నష్టపరిహారాన్ని విడుదల చేయండి : సిపిఎం

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**



జిల్లాలో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కురిసిన వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం విడుదల చేయాలని సిపిఎం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, మిరప, పొద్దుతిరుగుడు పంటలతో పాటు ద్రాక్ష, అరటి పండ్ల తోటలను భారీగా రైతులు నష్టపోయారన్నారు. రాప్తాడు మండలంలో బొమ్మేపర్తి, ప్రసన్నాయపల్లి, కూడేరు మండలం హంపాపురం లాంటి గ్రామాల్లో చేతిక వచ్చిన ద్రాక్ష తోటలు నేలకొరిగి లక్షలాది రూపాయలను నష్టపోయారన్నారు. వ్యవసాయ అధికారులు మాత్రం నామమాత్రపు అంచనాలు వేసి జిల్లాలో 13 మండలాల్లో 9,806 ఎకరాల్లో రూ.16.636 కోట్లు మాత్రమే నష్టం జరిగినట్లు అంచనాలు వేసి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం సరికాదన్నారు. ఇది రైతులను దగా చేయడమే అవుతుందన్నారు. వరి, వేరుశనగ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు కనీసంగా రూ.25 వేలు, మిరప, పత్తి పంటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యానవన పంటలు నష్టపోయిన రైతులకూ పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

**నకిలీ పత్తి విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోండి**

పెద్దవడుగూరు, పామిడి, యాడికి, తాడిపత్రి మండలాల్లో నకిలీ పత్తి విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, దీనిపై అధికారులు స్పందించి నకిలీ పత్తి విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని రాంభూపాల్ డిమాండ్ చేశారు. పామిడి మండలం గజరాంపల్లి గ్రామంలో రెండు వేల ఎకరాల్లో పత్తి పంట సాగైందన్నారు. 450 గ్రాముల పత్తి విత్తనం ప్యాకెట్ అసలు ధర రూ.700 కాగ కంపెనీలు కృత్రిమ కొరత సృష్టించి రూ.1800కు అమ్మారన్నారు. ఎరువులు, పురుగుల మందుల ధరలనూ భారీగా పెంచారన్నారు. విత్తనం నాశిరకం కావడంతో మూడు నెలల కావస్తున్నా పత్తి మొగ్గ పగలడం లేదన్నారు. ఎకరాకు రూ.40 నుంచి రూ.55 వేల వరకు పెట్టుబడులు పెట్టారన్నారు. చాలా మంది రైతులు కౌలుకు తీసుకుని పంట సాగు చేశారన్నారు. నకిలీ విత్తనాలతో రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలను గ్రామాలకు పంపి నకిలీ విత్తనాలపై పరిశీలన చేయించాలన్నారు. రైతులను మోసం చేసిన నకిలీ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రైతులను బెదిరిస్తున్న డిప్యూటీ తహశీల్దారు

### చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం డిమాండ్

**రాప్తాడు :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అలుపెరుగని పోరాటం చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులను, రైతులను అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు ఆఫీస్ నుండి బయటకు వెళ్లండంటూ బెదిరింపులకు పాల్పడుతూ దౌర్జన్యం చేస్తున్న రాప్తాడు మండల డిప్యూటీ తహశీల్దారు లక్ష్మీనరసింహులు పై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షులు పోతలయ్య, కార్యదర్శి బి.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2022 ఖరీఫ్‌లో ఈ-క్రాఫ్ బుకింగ్ చేయించుకున్న రైతులకు ఈ-కెవైసి రసీదులు ఇవ్వాలని తహశీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. తహశీల్దార్ లక్ష్మా నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా స్పందన రసీదు ఇవ్వాలని నాయకులు కోరారు. అందుకు డిప్యూటీ తహశీల్దారు రైతులను, రైతు సంఘం నాయకులను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు ఆఫీస్ నుంచి బయటకు వెళ్లండంటూ బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. డిప్యూటీ తహశీల్దారు రెచ్చిపోయి మాట్లాడుతున్నా కనీసం ఆపాలనే ప్రయత్నం కూడా తహశీల్దార్ చేయకపోవడం కుట్రపన్ని గొడవ పెట్టుకున్నారని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారి ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమై దౌర్జన్యానికి పాల్పడిన ప్రభుత్వ అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## 'అనంత'లో విద్యుద్ఘాతం

### ◆ ఇంట్లో వ్యాపించిన మంటలు ◆ ఊపిరాడక మహిళ మృతి

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

అనంతపురం నగరంలోని శారద నగర్‌లో విద్యుద్ఘాతం చోటు చేసుకుంది. బుధవారం రాత్రి పది గంటల సమయంలో ఇంట్లోని విద్యుత్ మీటర్ వద్ద షార్టు సర్క్యుట్ సంభవించింది. అక్కడి నుంచి వ్యాపించిన మంటలు పక్కనేవున్న సోపాసెట్‌పై పడి మంటలంటుకున్నాయి. వరుసగానున్న సోఫాసెట్‌తోపాటు సామాగ్రి అంటుకోవడంతో ఒక్కసారి ఇంట్లో మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. దీంతో భయపడిన ఆ ఇంట్లోనున్న వారు మరో గదిలోకి వెళ్లారు. మంటలు అధికమై పొగ చుట్టుముట్టింది. ఇంతలోనే పక్కనున్న వారు గమనించి ఇంట్లో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అరుణ(35) ఆసుపత్రికి వెళ్లేలోపు ఊపిరాడక చనిపోయింది. ఇద్దరు చిన్నారులు నిత్యసాయి, పాల్తున అస్వస్థతకు గురయ్యారు. వారికి ఊపిరి తీసుకోవడం కష్టమవడంతో ఆసుపత్రిలో వెంటిలేషన్‌పై ఉంచి కృత్రిమ శ్వాసను అందించారు. ఇంట్లో వ్యాపించిన మంటలను ఫైరింజన్‌తో అగ్నిమాపక శాఖ అధికారులు ఆర్పివేశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాదానికి కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు.

## అసంపూర్తి పనులను ఎప్పుడు పూర్తిచేస్తారు?

### అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

**ప్రజాశక్తి-పెద్దవడుగూరు**

జాతీయ ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో నిర్మిస్తున్న చెత్తతో సంపద తయారీ కేంద్రాలను పూర్తిచేయుటలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ పనులు పూర్తిచేసినట్లు చూపుతున్నారని, వాటిని ఎప్పుడు పూర్తి చేస్తారని సంబంధిత అధికారులపై కలెక్టర్ నాగలక్ష్మి మండిపడ్డారు. మిడుతూరు గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. అసంపూర్తిగా గోడలకే పరిమితమైన నిర్మాణాన్ని చూపి బాగా చేసినట్లు చూపుతున్నారే అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేవారు. ఇదేనా మీ పనితనానికి నిదర్శనమని ఆసహనం వ్యక్తంచేశారు. పనిలో అలసత్వం వహించిన అధికారులను సస్పెండ్ చేయాలని డిఆర్‌డిఎ పీడీని ఉద్దేశించి అన్నారు. అనంతరం ఆమె పెద్దవడుగూరులో జరుగుతున్న ఆహుడా డ్రెయినేజీ, సీసీరోడ్లు, ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణాలు, లక్ష్మంపల్లి, క్రిష్టిపాడు గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పెద్దవడుగూరులోని ఆర్డీటీ కాలనీలో నివాసం ఉంటున్న నారాణమ్మ అనే మహిళ తనకు ఇళ్లు లేక అద్దె గృహంలో ఉంటున్నాం.. ఇల్లు మంజూరు చేసేలా చూడాలని కలెక్టర్ నాగలక్ష్మీ దృష్టికి తీసుకెళ్లారు. స్థలం ఉంటే తప్పకుండా ఇల్లు మంజూరు చేస్తామని, మహిళ వివరాలు తీసుకోవాలని గృహ నిర్మాణశాఖ అధికారులకు సూచించారు. ఆమె వెంట సహాయ కలెక్టర్ ప్రశాంత్, ఆర్డీవో రవీంద్ర, తహసీల్దారు ఈరమ్మ, ఎంపీడీవో కుళ్లాయిస్వామి, మండల విద్యాధికారి రాముడు, ఆర్‌డబ్ల్యుఎస్, గృహనిర్మాణశాఖ ఏఈలు అవినాష్, మహేష్, ఐసిడిఎస్ గుత్తి ప్రాజెక్టు పెద్దవడుగూరు సూపర్‌వైజర్ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సాగునీరు అందించాలి : ఆర్.జితేంద్రగౌడ్

**ప్రజాశక్తి-గుంతకల్లు**

పంటలు చేతికి అందే సమయంలో సాగునీరు అందక పంటలు ఎండి పోయి రైతులు కన్నీరు పెడితే వైసిపి ప్రభుత్వానికి పతనం తప్పదని వెంటనే హంద్రీనీవా కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ అన్నారు. రైతులకు హంద్రీనీవా నీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జితేంద్రగౌడ్ నాయకత్వంలో రైతులు, టిడిపి నాయకులు పట్టణం లోని ఎన్టీఆర్ విగ్రహం నుండి రాజేంద్రనగర్‌లోని హంద్రీనీవా కార్యాలయం వరకు బుధవారం పాదయాత్ర నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. టిడిపి బిసిసెల్ జిల్లా నాయకులు గుమ్మనూరు వెంకటేసులు, బిసిసెల్ అధికార ప్రతినిధి, కౌన్సిలర్ పవన్‌కుమార్ గౌడ్, నాయకులు పాల మల్లికార్జున, మస్తాన్ యాదవ్, హనుమంతు, అనిల్ గౌడ్, కేశప్ప, ప్రతాప్ నాయుడు, మధు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్ తనిఖీ

**గుత్తి :** పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ బీసీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని మున్సిపల్ కమిషనర్ బివి. నరసారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని ఆయన పరిశీలించారు. వసతి గృహంలోని సౌకర్యాలపై ఆరాతీశారు. సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు.

## సత్యసాయి జయంతి వేడుకలు

**ఆత్మకూరు :** శ్రీ సత్యసాయి బాబా పుట్టినరోజు వేడుకలను ఆత్మకూరు మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ వర్క్స్ కార్మికులు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పంప్ హౌస్‌లో పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం చేశారు. సర్పంచి వరలక్ష్మి, ఎంపిపి హేమలత, ఎస్ఐ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## పండ్లతోటల పరిశీలన

**పుట్లూరు :** మండలంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేసిన డ్రైలాండ్ ఆర్టికల్చర్ పండ్లతోటలను ఎంపీడీవో యోగానందరెడ్డి బుధవారం పరిశీలించారు. కందిగోపుల గ్రామంలో రైతుల పండ్లతోటలను ఆయన పరిశీలించారు. మొక్కలు చావకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలని రైతులకు సూచించారు. ఏపీవో చెన్నకేశవులు, ఈసీ విజయ నాగేందర్‌రెడ్డి, టీఏ ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## ట్రై సైకిల్ అందజేత

**ఉరవకొండ :** భగవాన్ సత్యసాయి బాబా జన్మదినోత్సవం సందర్భంగా బాబా భక్తుడైన ప్రవాస భారతీయుడు తన సేవా గుణాన్ని చాటుకున్నారు. ఉరవకొండ పట్టణంలోని ఎస్కె ప్రభుత్వ హై స్కూల్‌లో వికలాంగురాలు నాగమణి 9వ తరగతి చదువుతోంది. పాఠశాలలో స్పెషల్ ఎడ్యుకేటర్‌గా పనిచేస్తున్న ఎర్రిస్వామి వికలాంగురాలుకి సాయం చేయాలని అమెరికాలో ఉంటున్న ప్రవాస భారతీయులు రాఘవ కాటూరి అన్నపూర్ణ దంపతులను మెయిల్ ద్వారా కోరారు. స్పందించిన వారు విద్యార్థినికి ట్రై సైకిల్ అందజేయాలని స్పెషల్ ఎడ్యుకేటర్ ఎర్రిస్వామికి డబ్బు పంపారు. ఆ మొత్తంతో మూడు చక్రాలు సైకిల్ కొనుగోలు చేసి హెచ్ఎం ప్రభాతమ్మ చేతుల మీదుగా విద్యార్థినికి బుధవారం అందజేశారు.

## క్యాట్ లెవెల్-2కు శ్రీ చైతన్య విద్యార్థులు

**అనంతపురం :** కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన 132 మంది విద్యార్థులు క్యాట్ లెవెల్-2 కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏజీఎం సుబ్బారెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబస్సుమ్, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్లు రిషిబాల అప్పలనాయుడు, ఏవో గోపాల్, ప్రైమరీ ఇన్‌ఛార్జి నీరజ, భారతి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి కరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డిప్యూటీ కలెక్టర్‌గా శంకరయ్య

**కళ్యాణదుర్గం :** మండల తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న శంకరయ్యకు రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించింది. బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయం నందు రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు శంకరయ్యకు అభినందించారు.



# ప్రభుత్వాలు సిగ్గుపడాలి

### కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప



మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

**ప్రజాశక్తి-గుంతకల్లు**

స్వాతంత్ర్యం వచ్చి 73 ఏళ్లు గడిచినా నేటికీ దేశంలో దళితులు వివక్షకు గురవుతున్నారని.. అందుకు పాలకులు, ప్రభుత్వాలు సిగ్గుపడాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప ఎద్దేవాచేశారు. బుధవారం గుంతకల్లు పట్టణం అల్లిపీరా కాలనీలోని మఠంలో జి.వీరన్న నగర్ నందు రెండు రోజుల కెవిపిఎస్ 6వ జిల్లా మహా సభలు ఆ సంఘం పట్టణ కమిటీ ఆధ్వ ర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ మహాసభలకు జిల్లాలోని అన్ని మండలాల నుండి ఆ సంఘం ప్రతి నిధులు హాజరయ్యారు. ముందుగా పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి నుండి డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో దళితులపై దాడులు పెచ్చుమీరిపోయాయన్నారు. దళితులపై జరిగిన దాడుల్లో ఏపీ 6వ స్థానంలో ఉండడం సిగ్గుచేటని అన్నారు. దళితుడి దేవాలయ ప్రవేశాన్ని అడ్డుకునే అగ్రవర్ణాలు అనేక గ్రామాల్లో ఇప్పటికి ఉన్నాయన్నారు. పాలకులు, ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నేటికీ దేశంలో దళితులు వివక్షతకు గురవుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం దళితులకు ఇవ్వాల్సిన 200 యూనిట్లు ఉచిత విద్యుత్తుకు ఆంక్షలు పెడుతూ పరోక్షంగా దళితులు వివక్షతకు గురయ్యేలా నిర్ణయాలు చేస్తున్నారని మండిపడ్డారు. చర్మకారులు, డప్పు, ఉరుముల కళాకారులు, కాటికాపర్లను ప్రభుత్వం గుర్తించి వారికి గుర్తింపు కార్డులు, పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సబ్ ప్లాన్ నిధులను దళితు లకు సక్రమంగా అమలు చేయకుండా జగన్ రెడ్డి ప్రభుత్వం పక్కదారి పట్టిస్తూ దగా చేస్తోందని విమర్శించారు. మూడెకరాల సాగుభూమి, గ్రామాలలో శ్మశానవాటికల సాధన కోసం, రాజ్యాంగంలోని హక్కుల సాధన కోసం దళితులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందుకు కెవిపిఎస్ సింహభాగంలో నిలచి పోరాటాలు చేస్తుందన్నారు. ఈ మహాసభల్లో కెవిపిఎస్ పట్టణ అధ్యక్ష వర్గం జగ్గలి రమేష్, వెంకటేసులు, అరుణమ్మ, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణ మూర్తి, చేతి వృత్తుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, రైతు సంఘం మండల కన్వీనర్ దాసరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పామిడి పెన్నానది రహదారి నిర్మాణం పూర్తిచేయాలి

### ఆర్అండ్‌బి అధికారులకు సిపిఎం నాయకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న రాంభూపాల్ తదితరులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

పామిడి పెన్నానది రహదారి నిర్మాణ పనులు త్వరగా చేపట్టి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో పామిడి ప్రజలు రోడ్లు భవనాల శాఖ ఎస్ఇ పిఎ పద్మనాభరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ రెండు నెలలుగా అధిక వర్షాల వల్ల పెన్నానదిలో ఉన్న 500 మీటర్లు రహదారి కూలిపోవడంతో ప్రయాణికుల రాక పోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అనంతపురం నుంచి హైదరాబాద్, కర్నూలు, గుత్తి, గుంతకల్లు, ఆధోని తదితర ముఖ్యపట్టణాలకు వేలాది బస్సులు వాహనాలు వెళుతుంటాయని తెలిపారు. పామిడి మీదుగా గుత్తి, పెద్దవడగూరు, గార్లదిన్నె, తరిమెల, వజ్రకరూరు, నాగసముద్రం మీదుగా వేలాది ఆటోలు తిరుగుతున్నాయని తెలిపారు. పెన్నానది బ్రిడ్జి కూలిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే పెన్నానది రహదారి పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన పిఎ ఎస్ఇ దృష్టికి తీసుకెళ్తామని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, వి.శివారెడ్డి, నాయకులు అనిమిరెడ్డి, నల్లప్ప, శ్రీనివాసులు, మల్లేసు, శంకర్, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

## మిరపకు నల్ల తామర తెగులు

### రైతన్నలకు గుబులు



తొలగించిన మిరప పంటను చూపుతున్న రైతులు

**ప్రజాశక్తి-బెలుగుప్ప**

మిరప పంటకు నల్ల తామర తెగులు సోకడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బెలుగుప్ప మండల వ్యాప్తంగా దాదాపు 900 వందల హెక్టార్లలో రైతులు మిర్చి పంటను మెట్ట భూములు, బోరు బావుల కింద సాగు చేశారు. ఎకరాకు రూ.లక్ష మేరకు ఖర్చుచేశారు. వాతావరణంలో మార్పుల కారణంగా మిర్చి పంటకు నల్ల తామర తెగులు సోకింది. వ్యవసాయ అధికారుల సలహాతో వివిధ రకాల మందులను పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది. ఇక చేసేదేమీ లేక రైతులు పంటను తొలగిస్తున్నారు. బెలుగుప్ప మండల కేంద్రానికి చెందిన రైతు రామచంద్రయ్య బోరుబావి కింద తమకున్న రెండు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశాడు. పంటకు నల్ల తామర తెగులు సోకింది. దిగుబడి రాదని తెలిసి పంటను తొలగించాడు. అప్పుచేసి పంట సాగుచేశానని, రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో తెగులు సోకిన మిర్చి పంటను పరిశీలించాలని, నష్ట నివేదికలను తయారు చేసి ప్రభుత్వానికి పంపి పరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

# తప్పుడు కథనాలను పోస్ట్ చేస్తే బుద్ధిచెబుతాం

### ఎస్ఎఫ్ఐ, ఆర్‌పిఎస్, ప్రజాసంఘాల నాయకులు




మాట్లాడుతున్న ఆర్‌పిఎఫ్ వ్యవస్థాపకులు పోతుల నాగరాజు

**ప్రజాశక్తి-అనంతపురం**

తప్పుడు కథనాలను పోస్ట్ చేసేవారికి తగిన బుద్ధిచెప్పాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌పిఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు నాయకులు మేల్కోవాలంటూ కంకి, కొడవలి కలిగిన ఎర్ర జెండా వేసుకున్న కార్టూన్ వేయడం నీచమైన పని అన్నారు. పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి బలమైన నాయకుడు కాబట్టి ఆయనను ఓడించేందుకు ఇలాంటి కుట్రపూరిత ఎత్తుగడలు వేస్తున్నారన్నారు. ఏ పార్టీ వారైనా ఆపార్టీ పేరు, ఫోన్ నెంబర్‌తో ధైర్యంగా ప్రచురించాలన్నారు. పోతుల నాగరాజు గతంలో టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేసి అద్భుతమైన ఓటు బ్యాంకును సాధించిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. ప్రస్తుతం ఆయన ప్రజల పక్షాన ఉంటూ తన వాణిని వినిపిస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తిపై వ్యంగ్యంగా కార్టూన్ వేయడం క్షమించరానిదని అన్నారు. ఇలాంటి పనులు చేసి భౌతిక దాడులు చేయించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి ఎక్కలూరి పుల్లయ్య, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సూర్యచంద్ర యాదవ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు సురేశ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ రెడ్డి, ఆర్‌పిఎఫ్ యువజన విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి ఆగడాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం..

### మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

వైసీపీ నాయకుల అవినీతి, దుశ్చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్రానికి చంద్రబాబు అవసరాన్ని తెలియజెప్పాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం రాయదుర్గంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' అన్న కార్యక్రమంపై క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మూడున్నరేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జగన్ అనుభవరాహిత్యం వల్ల రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. వింత వైఖరి, ఏకపక్ష ధోరణితో తీసుకొంటున్న అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రానికి అధోగతిపట్టిందన్నారు. అభివృద్ధి పూర్తిగా అడుగంటిందని, సంక్షేమం సైతం అరకొరగా అమలవుతోందన్నారు. జగన్ కక్షపూరిత చర్యలతో రాష్ట్రంలో సామాన్య ప్రజానీకం స్వేచ్ఛగా మాట్లాడలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మూడున్నరేళ్లలో చేసిన అభివృద్ధి కన్నా, ప్రశ్నించిన వారిపై పెట్టిన కేసులే ఎక్కువన్నారు. పేదల, రైతుల వ్యతిరేక పాలనపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడానికి డిసెంబరు1వ తేది నుండి ఇదేమి ఖర్మ.. ఈ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ కమిటీ ప్రతినిధులు ప్రధానపాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మండల కన్వీనర్లు బలరామిరెడ్డి, లాలెప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు ధనుంజయ్య, కేశవరెడ్డి, ఆనందరాజు, నాగరాజు, పురుషోత్తం, ఇనాయత్, సన్నన్న తదితరులు పాల్గొన్నారు.

## రాప్తాడు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

**రాప్తాడు :** రాప్తాడు పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో ముఖాముఖి సమావేశమయ్యారు. వారి సాధకబాధలను అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల దిశానిర్దేశం చేశారు. స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో తాజా పరిస్థితులపై ఆరాతీశారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల కట్టడికి కృషి చేయాలన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ఇతర విభాగాలతో కలిసి పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు చేపట్టి ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన చేయాలన్నారు.గ్రామాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల్లో మమేకమయ్యేలా పోలీసుల పనితీరు ఉండాలని సూచించారు. గ్రామ పోలీసులను సమన్వయం చేసుకుని నేరాలు తీవ్రం కాకుండా మొగ్గ దశలోనే అణచి వేయాలన్నారు. ఇటుకలపల్లి సి.ఐ మోహన్, రాప్తాడు ఎస్ఐ రాఘవరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారులతో కమిషనర్ సమావేశం

**అనంతపురం కార్పొరేషన్ :** ప్రతి సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు అవగాహన కల్పించి, లేఅవుట్లలో చేపడుతున్న నిర్మాణ పనులను తెలియచేస్తూ, వారిని తీసుకువెళ్లి ఇంటి నిర్మాణ పనులు ప్రత్యక్షంగా చూపించాలని, సోమవారం లోపు లబ్ధిదారుల నుండి కట్టించాల్సిన వాటా సేకరణ పూర్తి చేయాలని కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశించారు. బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 21వ తేదీన ముఖ్యమంత్రి జగనన్న కాలనీల ప్రారంభోత్సవానికి అనంతపురం వచ్చే సూచనలు ఉన్నాయన్నారు.

## నగరంలో శరవేగంగా అభివృద్ధి పనులు : అనంత

**ప్రజాశక్తి-అనంతపురం**

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో అనంతపురం నగరంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. బళ్లారి బైపాస్ నుంచి పంగల్ రోడ్డు వరకు జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు వంకర టింకరగా ఉన్నాయని కొందరు విమర్శిస్తున్నారని, వాళ్ల ఆలోచనలే వంకర టింకరగా ఉన్నాయని అన్నారు. బుధవారం నగరంలోని 10వ డివిజన్‌లో కార్పొరేటర్ లక్ష్మీదేవితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధిని ఆయా కుటుంబాలకు వివరిస్తూ స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## రేషన్ సరిగా పంపిణీ చేయాలని వినతి

**పుట్లూరు :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల్లో సక్రమంగా పంపిణీ చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు సుమతికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..పుట్లూరు మండలంలోని రేషన్ షాపుల్లో బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారన్నారు. అది కూడా రెండు నెలలకు ఒకసారి ఇస్తూ పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. బియ్యంతో పాటు చక్కెర, కందిబేడలు, పామాయిల్, ఉప్పు తదితరాలను అందజేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, మండల అధ్యక్షుడు పెద్దయ్య, సిపిఎం మండల కార్యదర్శి రామాంజి, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నాయకులు నాగభూషణం, సుబ్బరాయుడు, వెంకటరమణ, వెంకటనారాయణ, బాల గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వ్యవసాయ పద్ధతులతో లాభాలు

**రాయదుర్గం రూరల్ :** వ్యవసాయంలో మెరుగైన పద్ధతులు పాటించేలా రైతులను చైతన్య పరచాలని జిల్లా వనరుల కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి సూచించారు. స్థానిక మార్కెట్ యార్డులో ఎడిఎ లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో రాయదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాల రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సలహాలు, సూచనలు అందించేలా తర్ఫీదు పొందాలన్నారు. లాభసాటి వ్యవసాయం దిశగా పంటలు సాగు చేసేలా రైతాంగాన్ని ప్రోత్సహించాలన్నారు. పొలంబడిలో కచ్చితంగా పాటించాల్సిన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిఆర్‌సి వ్యవసాయ అధికారులు శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, వ్యవసాయ అధికారులు మహేంద్ర, శ్రావణ్ కుమార్, నిర్మల్ కుమార్, అహ్మద్ బాషా, కృష్ణకిషోర్ రెడ్డి, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయండి : ఎస్ఎఫ్ఐ

**ఆత్మకూరు :** మండల కేంద్రంలో బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఓతూరు పరమేష్, కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో ఇంటర్ విద్యను అభ్యసించడానికి గ్రామీణ ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థినులు వస్తుంటారన్నారు. ఆర్థిక ఇబ్బందులు, బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల చాలామంది చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ఇంటర్ కళాశాలకు అనుబంధంగా హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# నేరాలు ఘోరాలు

## ఉంతకల్లు ఘటనలో మరొకరు మృతి

**బొమ్మనహాల్ :** బొమ్మనహాల్ మండలం ఉంతకల్లు గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఈనెల 7వ తేది పురుగుల మందు తాగిన విషయం విధితమే. బళ్లారి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తల్లి షేకుంబీ, కుమారుడు మన్సూర్ మృతిచెందారు. పరిస్థితి విషమంగా ఉన్న షేకుంబీ భర్త సలీంబాషా బుధవారం తుది శ్వాస విడిచినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఒకే కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు చనిపోవడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులను సర్పంచి ముక్కన్న, ఎంపిటిసి సభ్యులు పరామర్శించారు.

## 27న ఉచిత వైద్యశిబిరం

**ఉరవకొండ :** ఉరవకొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 27న ఉచిత కంటి, కీళ్ళ, ఎముకల జబ్బుల నివారణకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున తెలిపారు. బుధవారం లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ చక్ర హాస్పిటల్ కర్నూలు వారి సహకారంతో డాక్టర్ ఎ.ప్రదీప్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కంటి సమస్యలు, కీళ్ళ, ఎముకల సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు, ఒక జత బట్టలు తీసుకునిరావాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు చందా కేసన్న, రీజియన్ ఛైర్మన్ కొమ్మసాని బాలచంద్ర, ప్రోగ్రాం కోఆర్డినేటర్ గణేష్ బాబు, కార్యదర్శి బి.లక్ష్మీనారాయణ, కోశాధికారి నజీర్‌సాబ్, లయన్స్ క్లబ్ స్టడీ అండ్ యోగా సెంటర్ కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, కోశాధికారి నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

## గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

### విడపనకల్ ఎస్ఐ సురేష్‌బాబు

**ఉరవకొండ :** క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని విడపనకల్ ఎస్ఐ సురేష్‌బాబు పేర్కొన్నారు. సుంకలమ్మ, దేవమ్మ పూల రథోత్సవం సందర్భంగా విడపనకల్లు మండల కేంద్రంలో దేశాయ్ సిద్ధార్థ ఆర్థిక సహాయ సహకారాలతో బుధవారం కబడ్డీ, క్రీడా పోటీలు నిర్వహించారు. విడపనకల్, పాల్తూర్, హవలిగి, మాలాపురం, చీకలగురికి తదితర గ్రామాలకు చెందిన 13 జట్లు పోటీలలో పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో విజయం సాధించిన జట్లకు రూ.10 వేలు, రూ.5వేలు, రూ.3 వేలు నగదు బహుమతులు, షీల్డ్ అందజేశారు. అనంతరం క్రీడా పోటీలకు ఆర్థిక చేయూతనందించిన దేశాయ్ సిద్ధార్థను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## యోగా పోటీల్లో గుత్తి విద్యార్థుల ప్రతిభ

**గుత్తి :** పట్టణంలోని ఆర్కె యోగా కేంద్రానికి చెందిన విద్యార్థులు యోగాసనాల పోటీల్లో ప్రతిభ చాటారు. అనంతపురం నగరంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో గుత్తికి చెందిన ఆర్కె యోగా కేంద్రం విద్యార్థులు అండర్14 బాలికల విభాగంలో ఖ్యాతిరెడ్డి ప్రథమ స్థానం, జయశ్రీ నాలుగో స్థానంలో నిలిచారు. అండర్ 17 బాలుర విభాగంలో హర్షవర్ధన్‌కు రెండో స్థానం దక్కింది. పోటీల్లో ప్రతిభ చూపిన ముగ్గురు వచ్చే నెల నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆర్కె యోగా కేంద్రం నిర్వాహకులు రామకష్ణారావు తెలిపారు.

## వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

**తాడిపత్రి రూరల్ :** తాడిపత్రి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సరస్వతి అధ్యక్షతన బుధవారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. మండల అధికారులు వారి వారి ప్రగతి నివేదికను చదివి వినిపించారు. మండలంలో అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. క్లాప్ మిత్రలకు ఆరు నెలల జీతాలు బకాయిలు ఉన్నాయని, ప్రతి పంచాయతీలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయి బిల్లులను చెల్లించాలని కోరగా టిడిపికి చెందిన సర్పంచులు అడ్డు తగిలారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో రంగారావు, యుఆర్‌డి జిలాన్‌బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు ఆలూరు సాంబశివారెడ్డి రాక

**పుట్లూరు :** సుబ్బరాయసాగర్ నుండి పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు నీరు విడుదల చేసేందుకు ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి గురువారం పుట్లూరుకి వస్తున్నట్లు ఎంపీపీ రాఘవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

## ఎస్ఎస్‌బిఎన్ విద్యార్థుల ప్రతిభ

**అనంతపురం :** ఎపిఎస్ఎసిఎస్ ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీల్లో ఎస్ఎస్‌బిఎన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లావ్యాప్తంగా 16 డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా ఎస్ఎస్‌బిఎన్ కళాశాలకు చెందిన ఎంపిసి థర్డ్‌ఇయర్ విద్యార్థి సాయిప్రమిద ప్రథమ బహుమతి రూ.8 వేలు, ఎంపిఎస్ సెకండ్ ఇయర్ విద్యార్థి అనిల్‌కుమార్ ద్వితీయ బహుమతి రూ.ఐదు వేలు, ఫైనల్ ఇయర్ విద్యార్థి లిమ్రాసలిత్ తృతీయ బహుమతి రూ.3 వేలు కైవశం చేసుకున్నారు. ఈనెల 21న విజయవాడలోని సోషల్ సర్వీస్ సెంటర్‌లో జరిగిన స్టేట్ లెవెల్ పోటీలలో ముగ్గురూ పాల్గొన్నారు. వీరిలో బిటిఎంసి ఫైనల్ ఇయర్ విద్యార్థి లిమ్రా సలిత్ ప్రథమ స్థానంలో నిలిచి రూ.10 వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎపి ఎస్ఎసిఎస్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ వై కామేశ్వర ప్రసాద్ విద్యార్థిని అభినందించారు. డిసెంబర్ 8వ తేదీన పాండిచ్చేరిలో జరిగే సౌత్ ఇండియా క్విజ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు విజయం సాధించాలని ఆకాంక్షించారు. డాక్టర్ పి.రాజేంద్రప్రసాద్, పిఇపిఎఫ్ ఎఆర్ కోఆర్డినేటర్ డాక్టర్, సౌమ్య డిప్యూటీ డైరెక్టర్ ఐసిఐసి, శ్రీ సాయికుమార్ డివిజనల్ అసిస్టెంట్ ఐఇసి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.ప్రభాకర్‌రాజు, కార్యదర్శి డాక్టర్ కె నిర్మలమ్మ, ప్రెసిడెంట్ పివి.రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా స్వధర్మ వాహిని ప్రచారయాత్ర

**రాయదుర్గం :** విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతిస్వామి వారు తలపెట్టిన స్వధర్మ వాహిని ప్రచార యాత్ర రాయదుర్గంలో బుధవారం వైభవంగా జరిగింది. స్వామివారిని కోటలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే, విప్ కాపు రామచంద్రారెడ్డి, ఆలయ పాలకమండలి అధ్యక్షులు గౌని పాలాక్షి రెడ్డి, సభ్యులు, దేవాదాయ శాఖ సమూహ దేవాలయముల కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసులు, తహశీల్దార్ మారుతి, పురపాలక సంఘం మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్ర రెడ్డి, పుర ప్రముఖులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సరస్వతి స్వామి వారు ఆలయంలో స్వామికి పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాంగణంలో పీఠ పూజ జరిపారు. ఆలయంలో కార్తీకమాసంలో పూజలు జరపడం తనకు ఎంతో ఆరోగ్యాన్ని కలిగించిందన్నారు. ధర్మ ప్రచార యాత్రలో భాగంగా స్వామివారు రాయదుర్గం పర్యటించడం స్థానికులకు కలిగిన అదృష్టం అని కాపు రామచంద్రా రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రతినిధులు, ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని నిరసన

**రాప్తాడు :** అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి పంచాయతీ పరిధిలోని శిల్పా లేపాక్షి నగర్‌లో నెల రోజుల నుండి ఎర్ర వంక ద్వారా రోడ్లమీద ఇళ్లలోకి పారుతున్న నీటిని వెంటనే తొలగించాలని, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కమిటీ కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం నగరానికి కూత వేటు దూరంలో ఉన్న శిల్పా లేపాక్షి నగర్‌లో దాదాపు 600లకు పైగా లేవుట్లు వేసి ఇళ్లు కూడా నిర్మించారన్నారు. లేఅవుట్ వేసే క్రమంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల కొంతమంది ఎర్రవంకను పూర్తిగా ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. వర్షాలకు హంపాపురం, జంగాలపల్లి, కందుకూరు చెరువులు నిండి కిందికి నీరు ప్రవహిస్తున్న క్రమంలో లేపాక్షి నగర్‌లోకి నీరు వస్తోందన్నారు. వర్షాలు వచ్చిన ప్రతిసారి కాలనీవాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు సర్వేచేసి ఆక్రమణకు గురైన ఎర్రవంకలో డ్రెయినేజీ ఏర్పాటు చేసి నీటిని కిందికి పోయే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పుష్పరాజు, ఓబులయ్య, చెన్నారెడ్డి పాల్గొన్నారు.